
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 5 | సెప్టెంబర్ | 2024



కంప్యూటర్ సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం బళ్ల చంద్రశేఖర్ (రామేశ్వరం) కంప్యూటర్‌ను సమర్పించారు.



గౌతమి ఎక్స్‌ప్రెస్ రద్దు

కాకినాడ: కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన గౌతమి ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. విజయవాడలో వరదల నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి పూజలు



పిఠాపురం: పట్టణంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభస్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వరద బాధితుల సహాయానికి చర్యలు

క్యూ ఆర్ కోడ్

అమలాపురం రూరల్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో దాతలు ముందుకొస్తున్నారు. మరింత మంది దాతలు విరాళాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బ్యాంకు ఖాతా నంబర్, అదేవిధంగా క్యూ ఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చిందని కలెక్టర్ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కుల ద్వారా సహాయం అందించవచ్చని అన్నారు. వీటి ద్వారా ఎవరైనా సహాయం అందించి వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు అండగా ఉండవచ్చన్నారు.

భార్యను హత్య చేసిన కేసులో వ్యక్తికి జైలు

మండపేట: భార్యను హత్య చేసిన కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్ష పడింది. రూరల్ సీఐ పీతల దొరరాజు కథనం ప్రకారం.. ఏడిద గ్రామానికి చెందిన పైడిమళ్ల సుదర్శనరావుకు కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామానికి చెందిన సుజాతతో వివాహం జరిగింది. సుదర్శనరావు వివాహేతర సంబంధం కలిగి ఉండటాన్ని సుజాత ప్రశ్నిస్తూ ఉండేది. 2015 ఏప్రిల్‌లో సుజాతను సుదర్శనరావు కొట్టి గాయపర్చాడు. అదే ఏడాది మే 26న సుజాత ఏడిదలోని ఇంట్లో ఉరి వేసుకున్నట్లు ఆమె తండ్రి, మేనమామలు గమనించారు. భర్తే చంపాడంటూ ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి సీఐ వి.పుల్లారావు దర్యాప్తు చేశారు. దీనిపై వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో అతనికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 10వ అడిషనల్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఆర్.శ్రీలత బుధవారం తీర్పు చెప్పారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, నావిస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ చదివిన అభ్యర్థులకు జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిశేషు బుధవారం తెలిపారు. జపాన్‌లో పనిచేయడానికి 32 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని, ఆరు నెలల పాటు బెంగళూరు నావిస్ సంస్థలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఫీజు రూ.3 లక్షలు చెల్లించాలని, ముందుగా రూ.25 వేలు అభ్యర్థి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే రూ.25 వేలు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చెల్లిస్తుందన్నారు. మిగిలిన ఫీజు లోన్ సౌకర్యం కల్పిస్తారని, ఉద్యోగం పొందిన అభ్యర్థికి జపాన్‌లో రూ.1.10 లక్షల నుంచి రూ.40 వేల వరకూ వస్తుందన్నారు. లోన్ పొందిన అభ్యర్థులు ఉద్యోగం వచ్చాక తిరిగి చెల్లించవచ్చని, ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోగా 94921 41999 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువకుడి దుర్మరణం

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. అనకాపల్లి జిల్లా కోట ఊరట్ల మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన కరణం నవీన్ (సిద్ధు) (22) మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలసి విజయవాడ వెళ్లాడు. అనంతరం తన స్వగ్రామం వస్తుండగా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారుకు వచ్చే సరికి ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. అతని తలకు బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా ట్యాంకర్‌ను పార్క్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు మృతుడి చిన్నాన్న కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ప్రకృతి సాగుతో మేలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచానికి సవాలుగా మారిన వాతావరణ కాలుష్యం, పెరుగుతున్న ఉష్ణోగ్రత తదితర సమస్యలను ప్రకృతి వ్యవసాయంతో పరిష్కరించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఇన్నీసుపేటలోని ఫంక్షన్ హాల్లో బుధవారం ఆయన అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై ఏడీఏలకు, ఏవోలకు వర్క్‌షాప్ ప్రారంభమైంది. రెండు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో డీఏవో మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, డీఆర్‌సీ ఏడీఏ జయలక్ష్మి, అడిషనల్ డీపీఎం వల్లి, డాట్ శాస్త్రవేత్త నరసింహారావు పాల్గొన్నారు.

కుండపోతై.. వరద ఉరకలై



ఓడలరేవు జెట్టీని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



చెరువులా మారిన రావులపాలెం బస్టాండ్ ఆవరణ

- జిల్లాలో ఎడతెరపి లేని వర్షం
- విద్యా సంస్థలకు సెలవు
- మళ్లీ ముంచుకొస్తున్న వరద
- ఆందోళనలో లంక వాసులు

సాక్షి, అమలాపురం: మేఘం బద్దలైంది.. వర్షం కుండపోతను తలపిస్తోంది.. మరోవైపు వరద ముంచుకు వస్తోంది. విజయవాడ విషాద ఘటన కదలాడుతున్న వేళ జిల్లా వాసులకు వర్షం, వరద కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరపి లేని వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల వరకూ జిల్లా వ్యాప్తంగా సగటున 46.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా కొత్తపేట మండలంలో 10.92 సెంటీ మీటర్ల వర్షం కురవడం విశేషం. ఆ తరువాత కూడా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తూనే ఉంది. గత నెల 29, 30 తేదీల్లో ఒక మోస్తరుగా, 31న భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. మధ్యలో రెండు రోజులు తెరపి ఇవ్వగా, బుధవారం తెల్లవారుజాము నుంచి కుండపోతను తలపించింది. వర్షం తగ్గే వరకూ జనం బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. భారీ వర్షాలతో బుధవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీల్లో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పలు మండలాల్లో వరి చేలు నీట మునిగాయి. ప్రస్తుతానికి పెద్ద నష్టం లేకున్నా వారం రోజులుగా వర్షాలతో తరచూ చేలు ముంపు బారిన పడుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మలికిపురం, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో పలుచోట్ల చేలు ముంపులో చిక్కుకున్నాయి. అసలే సీజనల్ వ్యాధులు, జ్వరాలతో ఆందోళనగా ఉన్న ప్రజలు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కలవరపడుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆత్రేయపురం, రావులపాలెం, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గురువారం ఉదయానికి 10 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేయనున్నారని, ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరమ్మతులకు గురైన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు, బలహీన ఏటిగట్ల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గోదావరి రేవుల వద్ద లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచి ప్రయాణికులను దాటించాలన్నారు. లోతట్టు గ్రామాల్లో గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో పునరావాస కేంద్రాలను గుర్తించి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్లవరం మండలంలోని ఓడలరేవు గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ చేపల మార్కెట్‌లో నిర్మించిన జెట్టీని పరిశీలించారు. అనంతరం గోడితిప్ప పంచాయతీ పరిధి గోపాయిలంక వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను చూశారు.

సుడులు తిరుగుతూ..

గోదావరికి వరద పోటు తగిలింది. తగ్గుతుందనుకున్న వరద పెరగడంతో లంక వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సాయంత్రం ఏడు గంటలకు 7,00,706 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. ఈ ప్రభావం జిల్లాపై గురువారం నుంచి పడనుంది. ఆ రోజు ఉదయం పది లక్షల నీరు విడుదల చేయనున్నందున తొలి ప్రమాదకర హెచ్చరిక జారీ అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. పి.గన్నవరం మండలంపై వరద ప్రభావం అప్పుడే కనిపిస్తోంది. ఈ మండలాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాలోని కనకాయిలంకకు వెళ్లేందుకు ఉన్న కాజ్‌వేపై వరద నీరు చేరింది. గౌతమీ, వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి కనిపిస్తోంది. పి.గన్నవరం, అన్నంపల్లి అక్విడెక్టుల వద్ద వరద సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. వర్షాలు, వరదల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ మహేష్ కుమార్‌తోపాటు ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

క్రమేపీ పెరుగుతూ..

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద క్రమేపీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 7 గంటలకు 44.30 అడుగులు, ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 9.60 అడుగులకు నీటిమట్టం చేరింది. వరదల నేపథ్యంలో సుమారు నెలా 15 రోజుల నుంచి పి.గన్నవరం మండలం ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిలంక, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో పడవలపై ప్రయాణించే లంక గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కొత్తపేట ఇన్‌చార్జి ఆర్డీఓ ఎస్.సుధాసాగర్ సూచించారు. బూరుగులంక రేవును ఆయన పరిశీలించారు. రేవులో కాపలాగా ఉన్న రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పడవపై 10 మందికి మించి ప్రయాణించవద్దని, ప్రతి ఒక్కరూ లైఫ్ జాకెట్లు ధరించాలని తెలిపారు.



బూరుగులంక రేవులో పడవ ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న లంక గ్రామాల ప్రజలు



పి.గన్నవరం పాత, కొత్త అక్విడెక్టుల వద్ద వరద ఉధృతి

జాతీయ రహదారిపై ప్రమాదం



గాయపడిన పొన్నాడ హరిగంగాధర్



మృతుడు సిద్ధాంతపు ముసలారావు (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ– ప్రత్తిపాడు జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అదే సమయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని పరిశీలించి తిరిగి వస్తుండగా ధర్మవరం వద్ద ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గుర్తించారు. వెంటనే చలించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో ఆయన ప్రోటోకాల్ వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. అనంతరం సీహెచ్‌సీ ఆర్ఎంఓ సౌమ్యకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సిద్ధాంతపు ముసలారావు వన్నెపూడి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా చెందుర్తి నుంచి బైక్‌పై ధర్మవరం యూనియన్ బ్యాంకుకు బయలు దేరారు. జాతీయ రహదారి పైనుంచి ధర్మవరం గ్రామంలోకి వెళ్తుండగా ఈ బైక్‌కు వెనుక వస్తున్న గొల్లప్రోలుకు చెందిన బొమ్మిడి బాబి, పొన్నాడ హరి గంగాధర్‌లకు చెందిన బైక్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సిద్ధాంతపు ముసలారావు (52), పొన్నాడ హరిగంగాధర్ (బైక్ వెనుక కూర్చున్న యువకుడు)లు గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని కలెక్టర్ షణ్మోహన్ అతని వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఇందులో సిద్ధాంతపు ముసలారావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు పాతికేళ్ల క్రితం దుర్గాడ నుంచి చెందుర్తి వచ్చి ఇక్కడ ఆర్ఎంపీగా స్థిరపడ్డాడు. గాయపడిన పొన్నాడ హరిగంగాధర్ పిఠాపురంలో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాజానగరంలో పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దార్ సూర్యప్రభ, సీహెచ్‌సీ ఆర్ఎంఓ పరిశీలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కొబ్బరి ధరహాసం

- పండగలతో అంబాజీపేట మార్కెట్‌లో పెరిగిన ధర
- వెయ్యి నీటి కాయలు రూ.12 వేలు
- ఉత్తరాదికి పెరిగిన ఎగుమతులు



అంబాజీపేటలో వ్యాపారుల వద్ద ఉన్న కొబ్బరి రాశి


సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరి మార్కెట్ కళకళలాడుతోంది. వరుస పండగలు కావడంతో కొబ్బరి కాయల ధర అంచనాలకు మించి పెరుగుతోంది. ప్రస్తుతం అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో నీటికాయ (నెల రోజుల ముక్కుడు కాయ) వెయ్యి ధర రూ.12 వేలకు చేరింది. పచ్చి కాయ ధర రూ.11 వేలు పలుకుతోంది. వారం రోజుల కిందట నీటికాయ వెయ్యి ధర కేవలం రూ.పది వేలు మాత్రమే ఉండేది. గడిచిన వారం రోజుల్లో ఏకంగా రూ.రెండు వేలు పెరగడం కొబ్బరి మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్న ఆర్డర్లతో కొబ్బరికాయ ధర పెరుగుతోంది.

కొబ్బరికి మంచి రోజులు వచ్చాయి. ధర పెరుగుతూ వస్తోంది. శ్రావణ మాసం తరువాత ఈ నెల వినాయక చవితి ఉత్సవాలు, అక్టోబర్ 12న దసరా ఉత్సవాలు, అదే నెల 31న దీపావళి, తరువాత నుంచి కార్తిక మాసం ఇలా వరుస పండగలతో కొబ్బరి కాయకు డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు దిగుబడి తగ్గడం కూడా కాయ ధర పెరగడానికి కారణమైంది. ఎకరాకు ప్రస్తుతం సగటున 500 కాయల దిగుబడి మాత్రమే వస్తోంది. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల దిగుబడి కనీసం 900 నుంచి వెయ్యి కాయల వరకూ ఉంటోంది. ఈ సమయంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్తాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖాండ్, మధ్యప్రదేశ్, ఛతీస్‌ఘడ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు 120 నుంచి 150 లారీల వరకు పచ్చికాయల ఎగుమతి అయ్యేది. ఇప్పుడు ధర ఉన్నా కేవలం 60 నుంచి 80 లారీల కొబ్బరికాయలు మాత్రమే ఎగుమతి కావడం వెనుక దిగుబడి తగ్గడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఏటా 122.50 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని అంచనా. అంబాజీపేట మార్కెట్ ధరలపైనే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి ధరల నిర్ణయం జరుగుతోంది. ఇక్కడ పెరగడం, తగ్గడంపైనే మిగిలిన ప్రాంతాల్లో కొబ్బరి ధరల్లో మార్పులు చోటు చేసుకుంటాయి.

రాశులు లేక దిగాలు

కొబ్బరి ధర పెరిగినా రైతుల వద్ద అనుకున్న స్థాయిలో రాశులు లేవు. ఇప్పటికే మూడొంతుల కాయ వ్యాపారుల వద్ద ఉంది. మే నెలలో నాఫెడ్ కేంద్రాలు తెరిస్తే కొబ్బరి కాయలకు డిమాండ్ వస్తోందని రైతులు భావించారు. ఇందుకు తగినట్లుగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు వచ్చిన కాయలను తమ వద్దే రాశులుగా ఉంచుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం నాఫెడ్ కేంద్రాలను జూలై మొదటి వారంలో కాని తెరవలేదు. తెరిచిన తరువాత స్థానికంగా ఉన్న ఎండు కొబ్బరిని కొనుగోలు చేయకుండా కేరళ, తమిళనాడు నుంచి దొడ్డిదారిన తెచ్చిన కొబ్బరి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక కొబ్బరికి ధర రాలేదు. ఈ విధానం చూసిన రైతులు తమ వద్ద ఉన్న కొబ్బరి రాశులను ఆగస్టులోనే వ్యాపారులకు అమ్మేశారు. మూడొంతుల దిగుబడి వ్యాపారుల వద్దకు చేరిన తరువాత ధర పెరగడం విశేషం. మార్కెట్‌లో కొబ్బరి పెరిగిన ఆనందం రైతులకు పూర్తి స్థాయిలో లేకుండా పోయింది. వచ్చే దింపు వరకూ ఈ ధర ఉంటే కొంత మేలని రైతులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడం, పండగల మార్కెట్ ఉన్నందున ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

అయినా నిరాశే..




పండగ సీజన్‌లో కొబ్బరి ధరలు పెరిగి ఆర్థిక ఇబ్బందులను తొలగుతానుకుంటే నిరాశే ఎదురవుతోంది. కొబ్బరికాయలు ఉన్న రోజుల్లో ధర ఉండడం లేదు. ధర ఉంటే కొబ్బరి దిగుబడులు కానరావడం లేదు. ఎప్పుడు ఏ సమయంలో ధరలు పెరుగుతాయో, తగ్గుతాయో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం కొబ్బరి ధరలు పెరిగినప్పటికీ కాయలు లేక పెద్దగా ఆదాయం రావడం లేదు.

–కూనపురెడ్డి వెంకట్రావు, కొబ్బరి రైతు, ఇరుసుమండ, అంబాజీపేట మండలం

సమాజ శిల్పులు ఉపాధ్యాయులు

- నేడు జిల్లా ఉత్తమ అవార్డుల ప్రదానం
- ఏర్పాట్లు చేసిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

రాయవరం/ బాలాజీచెరువు (కాకినాడ)/ కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సమాజ శిల్పులు ఉపాధ్యాయులు.. వీరికి స్ఫూర్తిగా నిలిచే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగానే గురువారం ఉమ్మడి తూర్పు తూర్పుగోదావరి వ్యాప్తంగా గురుపూజోత్సవం నిర్వహించుకునేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కోనసీమకు సంబంధించి అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహించనున్నారు. దీనికోసం జిల్లా యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ జిల్లాలో ఉత్తమ అవార్డులకు 42 మంది ఉపాధ్యాయులను ఎంపికయ్యారు.

- కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో ఈ వేడుకలు జరుగుతాయని డీఈఓ పిల్లి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా 70 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.
- తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా 70 మందిని ఎంపిక చేశామని డీఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షత ఏర్పడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను నిర్వహించింది. వీరికి రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో అవార్డులను అందించి సత్కరిస్తారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై న వారు ఉదయం 8 గంటలకే హాజరు కావాలని డీఈఓ కోరారు.

రైల్వే లైన్ అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

అమలాపురం రూరల్: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్‌మెంట్‌పై గ్రామాల వారీగా సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం మండలం భట్నవిల్లిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నిషాంతి మాట్లాడుతూ కోటిపల్లి– నరసాపురం ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ అమలాపురం రూరల్ మండలంలో భట్నవిల్లి, కామనగరువు, రోళ్లపాలెం, పేరూరు, ఇమ్మిడివరప్పాడు గ్రామాల మీదుగా వెళ్తుందన్నారు. ఆయా గ్రామాల్లో రైల్వే అలైన్‌మెంట్‌కు అడ్డుగా రోడ్లు, కాలువలు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఓఎన్జీసీ, గెయిల్ పైపులైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, నివాసాలు ఉన్నాయా లేదా అని సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను సూచించిన ప్రొఫార్మాలో ఈ నెల 17 లోపు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ జేడీ కిశోర్‌బాబు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.



భట్నవిల్లిలో రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి

